# కానరాని కాంక్ష

చంద్రానికి తనేం చెయ్యాల్సిందీ తోచలేదు. ఇంట్లో తల్లీ, భార్యా తనూ; బయట నిరుద్యోగ సమస్యా; తన బతుకు ఒక బాటలో పడేయకుండానే తండ్రి యీ లోకంతో నాకు సంబంధం లేదని ఎడారుల్లోకి వెళ్ళి ముక్కు మూసు క్కూర్చున్నాడు పెద్ద దిక్కు తల్లిమటు కుంది-ఆడది, అందులో మొగుడు సంసారంమీద విరక్తితో సన్యాసం పుచ్చుకున్న ప్రతిష్ఠ కలది-యేం చేస్తుంది? కొడుకుమీదే ఆశలు పెట్టుకుంది. వాడే యింత సంపాదించి యీ సంసారాన్ని యీడకు రావాలి.

చంద్రం తండ్రి లేచిపోయిన మొదటి రోజుల్లో బొత్తిగా గాభరా పడిపోయాడు. సంసారాన్ని సముద్రం మధ్యలో దించేసి ఆ తండ్రి పరమార్థం కోసమని ఎక్కడికో వెళ్ళిపోయాడు! తండ్రి యిట్లా వెళ్ళిపోవటాన్ని గురించి యేమనుకుందుకూ తోచిందికాదు చంద్రానికి. యేమనుకున్నా-చెయ్యాల్సిందిమాత్రం తన చేతులమీదుగానే జరిగిపోవాలి! గడవాల్సిన రోజుల్ని గురించి గగ్గోలుపడే పరిస్థితిలో అతడికి గడిచిపోయిన గాథ అంత పట్టినట్టులేదు. కాకపోతే ఒకటనుకున్నాడు: యివాళ కాకపోయినా రేపయినా యీ సంసార భారం తనమీద పడాల్సిందే అయి వుంది. తనయినా యింకా కుర్రనలుసు కాదు, ఇరవైయేళ్ళు నిండబోతున్నై. తండ్రి ధర్మాన భార్య కాపురాని క్కూడా వొచ్చింది. ఈ చర్యతోనే యికనాయన తను చెయ్యవల్సిన పన్లన్నీ అయిపోయినాయని భావించుకుని వెళ్ళిపోయాడు! చంద్రం లెక్క ప్రకారం తండ్రి కేవలం నిమిత్తమాత్రుడు, ఆ మాట కొస్తే యీ ప్రపంచంలో మటు కెవరు సంకల్పసిద్ధులు కనక?

"మీ నాయన సన్న్యాయం చేసిపోయినందుకు నాకేం బాధలేదు. కాని యీ సంసారం అంతా యేమవాలని ఆయన సంకల్పం? మనని యెట్లా బతకమని వొదిలి పెట్టిపోయినాడు? ఎంతసేపూ తన పరమార్థం

పరలోకచింతా చూచుకున్నాడే కాని యీ లోకంలో తన కుటుంబం యేమౌ తున్నది, తనవాళ్ళు ఎట్లా తంటాలు పడేది ఆయన ఆలోచించనేలేదు - కాని, అట్లాగని మనం విచారించి ప్రయోజనం వున్నది కనకనా? అన్నింటికి ఆ శ్రీరామచంద్రమూర్తే వున్నాడు—'' అన్నది తల్లి. ఆవిడ చెప్పిన ముక్కల్లో అంత నమ్మకం కలగలేదు చంద్రానికి. ఏమంటే తండ్రికి ఆధ్యాత్మికచింత యీ రోజున కొత్తగా వుదయించింది కాదు. రెండు—ఆయ నయినా సంసారాన్ని బొత్తిగా తుదీ మొదలూ లేనిచోట వొదిలెయ్యలేదు— ఈ అంశం మీదనే అతనికి బోలెడంత ఆలోచించాల్సి వచ్చింది. ఇన్నాళ్ళూ యీ సంసారం ఎట్లా గడిచిందో కూడా చంద్రానికి తెలీదు. తండ్రి డబ్బు సంపాయించుకు వచ్చేవాడు. తల్లి వండి పెట్టేది. ముగ్గురూ తిని తిరిగేవాళ్లు తను బడికి వెళ్లి వొస్తోండేవాడు! పిత్రార్జితం అంటూ తన కేమీ మిగల్లేదు. ఆ మాటకు తన తండ్రికిమాత్రం అట్లాంటిదేం వున్నది కనక? ఆయనా యింతకాలమూ స్వంతరెక్కలమీద బతికినవాడే! ఇవాళ తన పనీ అంతే అవనుంది! ఆశ్చర్యంలేదు. రెక్కలమీది సంపాదనే తన పిత్రార్జితం; వంశ పారంపర్య హక్కు.

తండ్రి యిలాంటి పని చెయ్యకుండా యింటనే వుండినట్లయితే యేం జరుగుండేదో చంద్రానికి వూహ కందిందికాదు, తన చదువు సంగతికి, అది ఒక గట్టుకు వొచ్చినట్లే—స్కూలు ఫైనలు ప్యాసయినట్లు తెలిశాకనే తండ్రి వెళ్ళిపోవటం జరిగింది. పోతే తనని కాలేజీలో చదివించే స్తోమతు ఆయన కున్నదీ—లేనిదీ తనకు యిప్పుడు ఆలోచిస్తే స్పష్టంగా తెలీదు. ఎంత వరకూ తనని యిబ్బంది పడకుండా లాక్కురావటమే ఆయనకు అప్పు డప్పుడూ అవస్థఅయి ఒక సమస్యగా ఘనీభవించిన రోజులు గుర్తుకొస్తు న్నాయి. ఏమయినా జరగనిదాన్ని గురించి ఆలోచించటం అనవసరమేకాక అప్రయోజకం కూడాను!—పోతే చంద్రం ఆలోచించగా తేలిందల్లా తన మీద పెద్ద బాధ్యత వున్నదనీ, దాన్ని తనెట్లాగయినా కొనసాగించుకోవాలనీ!

ఇక్కడ చంద్రం చేసిన వివేకమయిన పనేమిటంటే, తనమీద పడివున్న బాధ్యతని అతను గుర్తించ గలిగాడు. మధ్యమధ్య అంతరాత్మ యెదురు తిరిగినమాట నిజమే! కాని పాపం—దానికేం తెలుసు, అమాయకురాలు— అని సర్ది చెప్పుకుని బయటపడ్డాడు, ఇకమీద చంద్రం తన బాధ్యతని గుర్తించి తీరిగ్గా కూర్చుందుకు వీల్లేదు. కూర్చోక యేం చెయ్యాలి?

చంద్రం తండ్రి వెళ్ళిపోయిన్నాటికి యింట్లో పాతిక రూపాయల డబ్బుమాత్రం మిగిలుంది. ఆయన ధర్మమా అని ఊరిమీద అప్పు లేమీ అంటగట్టలేదు. పోతే—పాతిక రూపాయిలూ ఎన్నాళ్ళు వస్తాయి, మహా అయితే పాతిక రోజులు! తనకి ఏదేనా సంపాదన దొరికించుకోటానికి పాతిక రోజుల గడువు వున్నదని చంద్రం లెక్కవేసుకున్నాడు. అన్నీ అనుకూలించి యీలోపలే వుద్యోగం దొరికెనా మహాబాగే!

తండ్రిని గురించి ఆరాతీసిగానీ వెదికిగానీలాభం వుంటుందని ఎవరూ అనుకోలేను. యేమంటే ఆయన వుద్దేశ్యం అంతా లిఖితపూర్వకంగా యిచ్చేసి వెళ్లిపోయాడు. ఎక్కడికి వెళ్ళాడో తెలీక పోయినా, ఎక్కడేనా కనిపించినా బతిమాలినా వెనక్కుతిరిగి రాడనేది రూఢి!

ఉద్యోగప్రయత్నం అంటూ ఎట్లా చెయ్యాలో మొదట చంద్రానికి గోచరం కాలేదు. అతనికి దగ్గర్లో కావల్సినవాళ్లంటూ అంతగాలేరు. ఉన్న నలుగురూ తననిపరామర్శతో బాధపెట్టారేగాని—ఉపాయం యేమీ చూపాలని అనుకోలేదు పోతే చంద్రం చదువుకున్న హైస్కూలుంది. దాంట్లో గుమాస్తాపోస్టొకటి కొత్తగా శాంక్షన్ అయినట్లు చంద్రానికెవరో చెవిని వేశారు. హెడ్మాష్టరు తల్చుకుంటే చంద్రానికా వుద్యోగం రావటానికేమీ అభ్యంతరం లేదు. కాని అదే గట్టిచిక్కు. హెడ్మాష్టరుకు చంద్రం అంటే సదభిప్రాయం లేకపోగా మొదట్నుంచీ దురభిప్రాయం మటుకు మెండుగా వున్నది. దీనికి చంద్రానికి అంత సంబంధం లేకపోవచ్చును. కాని అది

లెక్కకురాని విషయం. హెడ్మాష్టరయినా పరిస్థితుల్ని కనిపెట్టి జాలిచేతో సానుభూతితోనో తన అభిప్రాయాలు మార్చుకునేంత మంచివాడు కాడు. ఏతా వాతా చంద్రానికి ఆ వుద్యోగం దక్కిందికాదు. మధ్యతరగతి వాళ్ళు యిచ్చే హామీల్లో హెడ్మాష్టరులాంటి పెద్దమనిషికి నమ్మకం కుదిరింది కాదు మరి!

ఇట్లా ఆలోచిస్తో కూర్చుంటే అప్పుడప్పుడూ చంద్రానికి తండ్రిమీద గౌరవంకూడా కలగ సాగింది. ఏమంటే ఆయన తనకు యింకో నలుగురు తమ్ముళ్ళనూ చెల్లెళ్ళనూ (ముఖ్యంగా పెళ్ళిళ్ళు కానివాళ్ళని) ఊరినిండా రకరకాల అప్పుల్నీ అంటగట్టి పోలేదు! తండ్రి యిట్లా ఎందుకు చెయ్యాల్సి వచ్చింది అంటే—దానికి చంద్రమే కాదు ఎవరూ కూడా సమాధానం చెప్పలేరు.

ఇంట్లో కూచుని తపస్సుచేస్తే ఉద్యోగం దొరకదని చంద్రం యెరుగును, కాని బయటకు వెళ్లిమాత్రం యేం చెయ్యాలనేదే అగోచరంగా వున్నది. ఎవరి నోటిమీదుగా విన్నా ఒకటే పురాణం: దేశంలో జనాభా పెరిగిపోయింది, ఉద్యోగాలు తరిగిపోయినాయి. గడ్డురోజులు దాపురించాయి—అని! కాని యీ కుటుంబాన్ని పోషించాలంటే తను పట్టుపట్టి యేదోవొక గొడుగుకింద దూరకతప్పదు. అనుకోవటమయితే చేతనవునుకాని దాన్ని యింప్లిమెంట్ చెయ్యటం మనచేతిలో లేదుగద! డిగ్రీలు పుచ్చుకున్న వాళ్లు ఉద్యోగాల కోసరమని రోడ్లువెంబడి తిరుగుతున్నారు. పెద్దపెద్ద చదువులున్న వాళ్ళకే దిక్కూ మొక్కూ లేకుండావుంది. తనేమయినా గొప్ప చదువు చదివాడు కనకనా,—కాని చదివిన చదువుచాలు ఎక్కడేనా డెభ్భై రూపాయల ఉద్యోగం దొరికేందుకు. అన్నిరకాల ఉద్యోగాలకి కాంపిటీషను జాస్తిగా వున్నది—చివరకు కాంట్రాక్టు కూలీలకుకూడా! ఈ పరిస్థితుల్లో చంద్రం ఎక్కడో ఒకక్కడ ఇరుక్కోవాలని ప్రయత్నం చెయ్యటం సాహసమే కావచ్చు. కాని అంతకన్నా అతను చెయ్యగలిగింది లేదు. అతనిది దురాశ కాకపోవచ్చు. కాని యీ ప్రపంచంలో కనీసపు కోర్కెలే తీరు

యేడవ్వ. చంద్రం దిగులుచూచి తల్లీ భార్యా బెంగపడ్డారు. సంసారభారం అంతా ఏమి తెలీనివాడిమిదా యింకా అంతభారం భరించలేనివాడిమీదా పడి, జరిగిన అన్యాయానికి వాళ్ళు వగుస్తున్నారు. ఎంతవగచినా తప్పే ముంది కనక ? తల్లిగోడు సరేసరి. భార్య చంద్రానికి కాస్త అండదండగా నిలిచింది. అతడికి మనశ్శాంతి అంటూ యేమయినా మిగిలిందంటే—చావ కుండా మిగిలిందంటే—దానికి ఆమే కారణం. అందుకు చంద్రం ఆమెకి చాలా ఋణపడి వుండాలి. ఋణాలూ పత్రాలు మాట దేవు డెరుగు, ముందు వుద్యోగంఅంటూ ఒకటి దొరికితే కాస్త నిలవ నీడ వుంటుంది. లేకపోతే—యేం జరగనున్నదో యీ సంసారానికి, అందరికీ తెలుసు—అట్లా అవాలని ఏవరూ కోరుకోరు కాని!

* * *

మొత్తానికి చంద్రం సాధించాడు. దేశంలో అనేకమందిని పీల్చి పిప్పి చెయ్య గలుగుతున్న సమస్యనించీ తను అతి చులాగ్గా యివతల పడగలిగినందుకు అతను మనసులో ఎవరికో ధన్యవాదా లర్పించుకున్నాడు. ఈ ఉద్యోగం అతనికి ఎక్కువ కష్టంలేకుండానే వచ్చింది. జీతం డెబ్భైఅయిదు యిస్తారు కనక యిక సంసారం అంతగా యిబ్బంది పడాల్సి వస్తుందని అనుకోక్క ర్లేదు. పోతే మొదట ఈ ఉద్యోగం చంద్రానికి అంత గౌరవనీయంగా కనిపించింది కాదు. పోస్టుజవాను పని! పగలు అస్తమానం వూరంతా యింటియింటికీ తిరిగి ఉత్తరాలు పంచిపెట్టటం! ఇదేదో నీచమనీ తను చెయ్యరానిదనీ చంద్రం అంతరాత్మ ముందు మభ్యపెట్ట చూచింది కాని, యీ సారికూడా అతను అంతరాత్మని అవతలికినెట్టి ముందుకు వచ్చి నించున్నాడు. జవానుపనే అవుగాక! తనకు సరిపోయే జీతం యిస్తారు అదీ కాక—ఒక ఉద్యోగంఅంటూ తనకు అత్యవసరం అయి కూర్చుంది. ముందూ వెనకా ఆలోచించుకోటానికి అవకాశంలేదు. వెంటనే చేరేశాడు. తల్లీ భార్యా ప్రోత్సహించారు కూడాను! చంద్రానికి క్రమంగా ఉద్యోగం అలవాటయిపోయింది-సంసారం సజావుగా జరిగిపోతోంది,

పోతే—చంద్రం వుద్యోగంలో చేరిన మూణ్ణెల్లకు గొప్పవిశేషం జరిగింది. ఒకనాడు ఉదయం—యింకా పూర్తిగా తెల్లవారలేదు—ఎవరో తలుపు తట్టారు. చంద్రం మెళకువగా పడుకునే వున్నాడు. లేచి తలుపు తీదామనుకుంటూనే లేవలేకపోతున్నాడు. ఇంతలో ఆ కాస్త పనీ తల్లీ చేసేసింది. తీరా గుమ్మం అవతల నించునున్న మనిషిని చూచి ఆమె కెవ్వున కేక వేసి కింద పడిపోయింది. ఈ కేకతో చంద్రం, భార్యా యివతలికి వచ్చారు. ఆశ్చర్యం! తండ్రి వచ్చాడు. చంద్రానికి నోట మాట రాలేదు. అట్లాచూస్తో నించుండి పోయాడు. అతని భార్యకుమటుకు నీళ్ళు తెచ్చి అత్తగారి ముఖాన చల్లాలని ఆమెను లేవదీసి కూచోబెట్టాలనీ తోచింది.

తరువాత తల్లీ తండ్రీ కుశల ప్రశ్నలు వేసుకున్నారు. చంద్రానికి ఆయన్తో మాట్లాడాలని అనిపించలేదు—కారణం అతనికే తెలీదు. పోతే ఆయన మాత్రం అతనివేపు చాలా జాలిగా ప్రేమగా చూచినిట్టూర్చాడు.

"ఏమండీ.... అట్లా ఎందుకు వెళ్ళిపోయినారండీ-మేమంతా యేమవుతామనుకున్నారు. చిన్న చీటీముక్క రాసిపోతే మీకూ మాకూ సంబంధం తీరిపోతుందనుకున్నారా?" అనడిగింది తల్లి.

"అట్లా ఎందుకు వెళ్ళిపోయినానో నన్నడక్కు. మళ్ళీ ఎట్లా తిరిగొచ్చానో అడుగూ-చెబుతాను. నా కా జీవితం సరిపడళ్ళేదు. ఒంటరిగాడినీ! యేమీ పని లేదు. యేమీ సమస్యలు లేవు. ఉన్నదల్లా ఒక్కటే ఆలోచన దానికి తుదీ మొదలూ కనిపించదు. మీరంతా యేం చేస్తున్నారో చూదామనిపించింది, వొచ్చాను. మళ్ళీ వెళ్ళటం నా సాధ్యం కాదు—యీ సారి నువు తరిమేసినా సరే!" అని జవాబు చెప్పాడు తండ్రి.

"ఆ! నాకు తెలుసు. యివాళ కాకపోయినా రేపయినా మీరు తిరిగొస్తారని నేననుకుంటూనే వున్నాను" అన్నది తల్లి.

చంద్రానికి యిందులో ఎంతవరకు సత్యం వుందో బోధపడ లేదు—యేమంటే ఆమె ముం దెప్పుడూ తనతో యీ ముక్క అనలేదు. *

(ఆంధ్ర ప్రభ వార పత్రిక)